మన ప్రజా ప్రతినిధి
ప్రశ్నించడం కోసం...?
RNI NO. TELTEL/2023/90455
ప్రజా ప్రతినిధి NEWS టీ.వి
తెలుగు దినపత్రిక
ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :302 బుధవారం ఆగష్టు 26 2026, పేజీలు - 4 వేల : 2/-
epaper.manaprajaprathinidhi.com
PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

# పంచదార ధరలకు కేంద్రం బ్రేక్

- 15 శాతం పడిపోయిన టోకు ధరలు
- అక్రమ నిల్వలపై ఉక్కుపాదం మోపిన కేంద్రం
- రానున్న రోజుల్లో మరింత తగ్గుదల అంచనా
- వినియోగదారులకు త్వరలోనే తీపి కబురు



న్యూఢిల్లీ, ఆగస్టు 25 (మనప్రజాప్రతినిధి): దేశవ్యాప్తంగా పంచదార ధరల పెరుగుదలపై ఆందోళనలు వ్యక్తమవుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఫలితాలను ఇవ్వడం ప్రారంభించాయి. సుంకం లేకుండా 10 లక్షల టన్నుల ముడి పంచదార దిగుమతులకు అనుమతించడం, నిల్వదారులపై వరుస తనిఖీలు నిర్వహించడం, అక్రమ నిల్వలపై కఠిన చర్యలు చేపట్టడంతో టోకు మార్కెట్‌లో ధరలు కేవలం కొన్ని రోజుల్లోనే దాదాపు 15 శాతం వరకు తగ్గాయి. దేశంలో పంచదార కొరత లేదని ప్రభుత్వం స్పష్టం చేస్తుండగా, కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నాలే ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. గత వారం వరకు రికార్డు స్థాయికి చేరుకున్న పంచదార ధరలు ప్రస్తుతం క్రమంగా దిగివస్తున్నాయి. మహారాష్ట్రతో పాటు ప్రధాన వ్యాపార కేంద్రాల్లో క్వింటాల్‌కు వందల రూపాయల మేర తగ్గుదల నమోదైంది. టోకు మార్కెట్‌లో కిలో ధర సుమారు రూ.62 స్థాయికి చేరుకోగా, రానున్న రోజుల్లో మరో రూ.2 నుంచి రూ.3 వరకు తగ్గే అవకాశముందని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. కేంద్రం తీసుకున్న చర్యల ప్రభావం మార్కెట్‌పై స్పష్టంగా కనిపిస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు. ధరల నియంత్రణ కోసం కేంద్ర ప్రభుత్వం వరుస చర్యలు చేపట్టింది. పంచదార డీలర్ల నిల్వలపై పరిమితులు విధించడం, భారీ 2


## రెబల్ ఎంపీలకు సుప్రీం నోటీసులు



- 20 మంది ఎంపీలకు నోటీసులు జారీ చేసిన ధర్మాసనం
- అనర్హత పిటిషన్లపై విచారణ వేగవంతం చేయాలన్న టీఎంసీ
- కేవలం నోటీసులు సరిపోవని కోర్టు వ్యాఖ్య
- విలీనం చెల్లుబాటుపై రెబల్ వర్గం వాదన

2

## కొత్త తరానికి అవకాశం ఇవ్వాలి గడ్కరీ



- యువ నాయకత్వానికి బాధ్యతలు అప్పగించే సమయం
- మూడు దశాబ్దాల ప్రజా జీవితంపై వ్యాఖ్యలు
- అభివృద్ధి పనుల వేగం పెరగాలని ఆకాంక్ష
- రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసిన వ్యాఖ్యలు

2

## డిసెంబర్‌లో రెండో దశ స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సన్నాహాలు




- ఎస్ఐఆర్ పూర్తయ్యాక ఎన్నికల ప్రక్రియకు అవకాశం
- ఐదు కార్పొరేషన్లపై ప్రత్యేక దృష్టి
- పెండింగ్ మున్సిపాలిటీలకూ ఎన్నికల నిర్వహణ యోచన

2

## వెలిగొండ జలాలతో కరువుకు చెక్ సీఎం



- ఆగస్టు 31న ఫేజ్-1 ప్రారంభానికి సిద్ధం
- 10.7 టీఎంసీల నీటిని నల్లమల సాగర్‌కు విడుదల
- లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టు
- పశ్చిమ ప్రకాశం అభివృద్ధికి కొత్త దిశ

2

## త్వరలో ఇంటింటికి... ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకం ప్రారంభం



- పేద మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు
- బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలు
- ఆన్‌లైన్ దరఖాస్తులకు సెప్టెంబర్ 15 వరకు గడువు
- అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సూచన

3

## బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్



- బీపీ మండల్ జయంతి సందర్భంగా నివాళులు
- గన్‌పార్క్ వద్ద బీసీ నాయకుల సమావేశం
- కులగణన లేక రిజర్వేషన్లకు ఇబ్బందులని వ్యాఖ్య
- కేంద్రంపై ఒత్తిడి తేవాలని మాజీ మంత్రి పిలుపు

3

## మొక్కలతో పచ్చని తెలంగాణ నిర్మాణం



- ప్రత్యేక వనమహోత్సవంలో మొక్కలు నాటిన మంత్రి
- పర్యావరణ పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం అవసరం
- భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణం లక్ష్యం
- మొక్కల సంరక్షణపై అవగాహన కల్పింపు

2

# పంచదార ధరలకు కేంద్రం బ్రేక్

మెదటి పేజీ తరువాయి



వినియోగదారుల నిల్వలను నియంత్రించడం, గోదాముల తనిఖీలు నిర్వహించడం, మిల్లుల వద్ద భౌతిక ధృవీకరణ చేపట్టడం వంటి చర్యలతో మార్కెట్‌లోకి సరఫరా పెరిగింది. అంతేకాక దాదాపు పదేళ్ల తర్వాత మొదటిసారిగా 10 లక్షల టన్నుల ముడి పంచదారను సుంకం లేకుండా దిగుమతి చేసుకునేందుకు అనుమతించింది. ప్రస్తుతం దేశంలో పండుగల సీజన్ సమీపిస్తున్నప్పటికీ పంచదార నిల్వలు తగినంతగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. దేశ అవసరాలకు సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, కొత్త క్రషింగ్ సీజన్ ప్రారంభమయ్యే వరకు ఎలాంటి కొరత ఉండదని పరిశ్రమ వర్గాలు భరోసా ఇస్తున్నాయి. మార్కెట్‌లో కనిపించిన ధరల పెరుగుదలలో పెద్ద భాగం ఊహాగానాలు, నిల్వల పెంపుదల కారణంగానే జరిగిందని వారు పేర్కొంటున్నారు. అయితే టోకు ధరలు తగ్గినా రిటైల్ మార్కెట్‌లో ఆ ప్రభావం ఇంకా పూర్తిగా కనిపించడం లేదు. అనేక ప్రాంతాల్లో కిలో పంచదార ధర ఇంకా అధిక స్థాయిలోనే కొనసాగుతోంది. గతంలో అధిక ధరలకు కొనుగోలు చేసిన పాత నిల్వలను వ్యాపారులు విక్రయిస్తున్నందున వినియోగదారులకు వెంటనే ప్రయోజనం అందడం లేదని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. కొత్తగా తక్కువ ధరలకు వచ్చిన సరుకు మార్కెట్‌లోకి చేరిన తర్వాత చిల్లర ధరల్లో కూడా తగ్గుదల కనిపించే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. కేంద్రం చేపట్టిన చర్యలు కొనసాగితే రాబోయే వారాల్లో పంచదార ధరలు మరింత స్థిరపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. పండుగల సీజన్‌కు ముందు ధరలను నియంత్రణలో ఉంచేందుకు ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తుండగా, వినియోగదారులకు కూడా త్వరలోనే తీపి కబురు అందే అవకాశముందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి

# రెబల్ ఎంపీలకు సుప్రీం నోటీసులు

మెదటి పేజీ తరువాయి



న్యూఢిల్లీ, ఆగస్టు 25 (మనప్రజాప్రతినిధి): తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది రెబల్ లోక్‌సభ సభ్యులపై దాఖలైన అనర్హత పిటిషన్ల వ్యవహారంలో సుప్రీంకోర్టు కీలక చర్యలు చేపట్టింది. ఈ ఎంపీలకు మంగళవారం నోటీసులు జారీ చేస్తూ వారి వాదనలు వినిపించాలని ఆదేశించింది. ఫిరాయింపుల నిరోధక చట్టం కింద వారిపై చర్యలు తీసుకోవాలంటూ టీఎంసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం విచారణ జరిపింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం. పంచోలిలతో కూడిన ధర్మాసనం ముందు ఈ కేసు విచారణకు వచ్చింది. టీఎంసీ తరఫున సమర్పించిన పిటిషన్‌లో, రెబల్ ఎంపీలపై అనర్హత పిటిషన్లు లోక్‌సభ స్పీకర్ వద్ద పెండింగ్‌లో ఉన్నప్పటికీ వాటిపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని కోర్టును కోరారు. లోక్‌సభ స్పీకర్ తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, అనర్హత పిటిషన్లపై స్పీకర్ ఇప్పటికే నోటీసులు జారీ చేశారని ధర్మాసనానికి వివరించారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం, కేవలం నోటీసులు జారీ చేయడం మాత్రమే సరిపోదని, నిర్దిష్ట కాలపరిమితిలోగా విచారణ పూర్తి కావడం కూడా అవసరమని స్పష్టం చేసింది. పెండింగ్ అంశాలను నిరవధికంగా కొనసాగించరాదని వ్యాఖ్యానించింది. విచారణ సందర్భంగా స్పీకర్‌కు కూడా నోటీసులు జారీ చేయాలనే అభిప్రాయాన్ని ధర్మాసనం తొలుత వ్యక్తం చేసింది. అయితే స్పీకర్ రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్నారని, ఇప్పటికే ప్రక్రియ ప్రారంభమైందని సొలిసిటర్ జనరల్ చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. అనంతరం రెబల్ ఎంపీలకు నోటీసులు జారీ చేసి తదుపరి విచారణకు కేసును వాయిదా వేసింది. ఇటీవల టీఎంసీకి చెందిన 20 మంది లోక్‌సభ సభ్యులు త్రిపురకు చెందిన నేషనల్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియాలో విలీనమయ్యామని ప్రకటించారు. అనంతరం వారు జాతీయ ప్రజాస్వామ్య కూటమిలో చేరారు. ఈ పరిణామం తర్వాత పార్లమెంటులో వారిని ప్రత్యేక వర్గంగా గుర్తిస్తూ వ్యవహరిస్తున్నారు. అయితే టీఎంసీ గుర్తుపై ఎన్నికైన సభ్యులు మరో పార్టీలో చేరడం ద్వారా స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వాన్ని వదులుకున్నట్లేనని, అందువల్ల ఫిరాయింపుల నిరోధక చట్టం కింద వారిని అనర్హులుగా ప్రకటించాలని టీఎంసీ వాదిస్తోంది. మరోవైపు తమది చట్టబద్ధమైన విలీన ప్రక్రియేనని, రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగానే నిర్ణయం తీసుకున్నామని రెబల్ ఎంపీల వర్గం చెబుతోంది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు విచారణ రాజకీయంగా, న్యాయపరంగా ప్రాధాన్యం సంతరించుకుంది

# కొత్త తరానికి అవకాశం ఇవ్వాలి గడ్కరీ


మెదటి పేజీ తరువాయి



నాగ్‌పూర్, ఆగస్టు 25 (మనప్రజాప్రతినిధి): కేంద్ర రహదారులు, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. నాగ్‌పూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, గతంలో మాదిరిగా తాను ఇప్పుడు ఎక్కువగా పనిచేయలేనని, కొత్త తరానికి అవకాశాలు కల్పించాల్సిన సమయం వచ్చిందని పేర్కొన్నారు. యువ నాయకత్వం ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. దాదాపు మూడు దశాబ్దాలుగా ప్రజా జీవితంలో కొనసాగుతున్నానని గడ్కరీ తెలిపారు. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో సవాళ్లు, విజయాలు, అనుభవాలు ఎదురయ్యాయని గుర్తు చేసుకున్నారు. ప్రజా జీవితంలో అనేక బాధ్యతలు నిర్వహించే అవకాశం లభించిందని, ప్రజల ఆశీస్సులు తనకు ఎప్పుడూ బలంగా నిలిచాయని చెప్పారు. ప్రస్తుతం తాను ప్రజా కార్యక్రమాల్లో గతంతో పోలిస్తే తక్కువగా పాల్గొంటున్నానని గడ్కరీ వెల్లడించారు. యువతకు మరింత అవకాశాలు కల్పించి, వారికి బాధ్యతలు అప్పగించడం అవసరమని అన్నారు. భవిష్యత్తు నాయకత్వాన్ని తీర్చిదిద్దడంలో అనుభవజ్ఞులు మార్గనిర్దేశకులుగా వ్యవహరించాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాల విషయంలో మాత్రం తన కట్టుబాటు కొనసాగుతుందని గడ్కరీ స్పష్టం చేశారు. దేశ అభివృద్ధి వేగం మరింత పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా మౌలిక సదుపాయాల రంగంలో చేపడుతున్న పనులు ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పులు తీసుకువస్తాయని చెప్పారు. మహారాష్ట్రలోని ప్రతి గిరిజన గ్రామానికి విద్యుత్ సౌకర్యం అందించాలన్నదే తన ప్రధాన లక్ష్యమని గడ్కరీ తెలిపారు. విద్యుత్, రహదారులు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి వేగవంతమవుతుందని అన్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చివరి వ్యక్తికి చేరేలా కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు. ఇటీవల భారతీయ జనతా పార్టీ జాతీయ సంస్థాగత బృందంలో జరిగిన మార్పుల నేపథ్యంలో గడ్కరీ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. కొత్త జాతీయ బృందంలో పెద్ద సంఖ్యలో కొత్తవారికి అవకాశం కల్పించడంతో పార్టీలో తరాల మార్పు సంకేతాలు కనిపిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గంలోనూ మార్పులు ఉండొచ్చన్న ఊహాగానాలు కొనసాగుతుండగా, గడ్కరీ వ్యాఖ్యలు మరింత ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

# డిసెంబర్‌లో రెండో దశ స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సన్నాహాలు

మెదటి పేజీ తరువాయి




హైదరాబాద్, ఆగస్టు 25 (మనప్రజాప్రతినిధి): తెలంగాణలో రెండో దశ స్థానిక సంస్థల ఎన్నికలను ఈ ఏడాది డిసెంబర్ నెలలో నిర్వహించే దిశగా ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ పూర్తయిన వెంటనే ఎన్నికల షెడ్యూల్‌పై నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అధికార వర్గాల్లో జరుగుతున్న చర్చల ప్రకారం డిసెంబర్‌లో కీలక పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే అంశం పరిశీలనలో ఉంది. ఈ దశలో సైబరాబాద్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్, వరంగల్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 2026లో జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కొన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను వాయిదా వేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయా సంస్థల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. హైదరాబాద్ మహానగర పునర్వ్యవస్థీకరణ తర్వాత ఏర్పాటైన సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్లకు ఇప్పటివరకు ప్రజాప్రతినిధుల ఎన్నికలు జరగలేదు. దీంతో ఈ రెండు కొత్త కార్పొరేషన్లకు తొలి ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీలతో పాటు ప్రజల్లోనూ ఆసక్తి నెలకొంది. మరోవైపు వివిధ న్యాయ, పరిపాలనా కారణాలతో ఎన్నికలు జరగని అచ్చంపేట, మందమర్రి, మణుగూరు, నకిరేకల్, కొత్తూరు, సిద్ధిపేట మున్సిపాలిటీలకు కూడా ఇదే విడతలో ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఈ మున్సిపాలిటీల ఎన్నికలు ఫిబ్రవరి ఎన్నికల షెడ్యూల్‌లో భాగం కాలేదు. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత తుది ఓటరు జాబితా సిద్ధం కానుంది. అనంతరం వార్డుల వారీగా ఎన్నికల ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాల ఖరారు, ఎన్నికల సిబ్బంది నియామకం వంటి ప్రక్రియలు వేగవంతం కానున్నాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా అవసరమైన ప్రాథమిక ఏర్పాట్లపై ఇప్పటికే దృష్టి సారించినట్లు తెలుస్తోంది. డిసెంబర్‌లో ఎన్నికలు జరిగితే రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి వేడి రాజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి వంటి పట్టణ ప్రాంతాల్లో జరిగే ఎన్నికలు అన్ని ప్రధాన పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారనున్నాయి. అధికారిక షెడ్యూల్‌పై ఇంకా స్పష్టత రానప్పటికీ, రాజకీయ పార్టీలు మాత్రం ఇప్పటికే ఎన్నికల సమరానికి సన్నద్ధమవుతున్నాయి

# వెలిగొండ జలాలతో కరువుకు చెక్ సీఎం

మెదటి పేజీ తరువాయి



అమరావతి, ఆగస్టు 25 (మనప్రజాప్రతినిధి): ఎన్నో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-1ను ఈ నెల 31న ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఎన్నో అవాంతరాలు, సవాళ్లు, అడ్డంకులను అధిగమించి ప్రాజెక్టు తొలి దశను పూర్తి చేశామని పేర్కొన్నారు. తీవ్ర కరువు ప్రాంతంగా పేరున్న ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజలకు కృష్ణా జలాలను అందించడం ద్వారా వారి జీవితాల్లో కొత్త మార్పులు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టుకు 1996 మార్చి 5న తాను ముఖ్యమంత్రిగా శంకుస్థాపన చేశానని చంద్రబాబు గుర్తు చేశారు. మూడు దశాబ్దాల తర్వాత అదే ప్రాజెక్టును తన చేతుల మీదుగా ప్రారంభించడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రాజెక్టు ఫేజ్-1 ప్రారంభంతో 10.7 టీఎంసీల నీటిని నల్లమల సాగర్‌కు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ప్రాజెక్టు మొదటి దశ ద్వారా 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుండగా, రెండో దశ పూర్తయిన తర్వాత మొత్తం 3.283 లక్షల ఎకరాలకు నీటి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. అలాగే లక్షలాది మందికి తాగునీరు అందించడంతో పాటు తరతరాలుగా కరువుతో పోరాడుతున్న ప్రజలకు శాశ్వత ఉపశమనం కలిగించడమే లక్ష్యమన్నారు. మార్కాపురం ప్రాంతానికి వెలిగొండ ప్రాజెక్టు అభివృద్ధికి కొత్త వెలుగులు తీసుకురానుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. కృష్ణా జలాలతో కరువు నేలను సస్యశ్యామలం చేసి రైతుల జీవితాల్లో కొత్త ఆశలు నింపనున్నట్లు చెప్పారు. ఈ జలాలతో సాగు, తాగునీటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. పశ్చిమ ప్రకాశం ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని చంద్రబాబు తెలిపారు. మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చామని చెప్పారు. రాయలసీమ, ఉమ్మడి ప్రకాశం జిల్లాలను ఉద్యానవన పంటల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులతో కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. బెంగుళూరుఅమరావతి జాతీయ రహదారి, రామాయపట్నం పోర్టు వంటి ప్రాజెక్టులతో ఈ ప్రాంతంలో వాణిజ్య, పారిశ్రామిక అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయని తెలిపారు. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించి ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని స్పష్టం చేశారు. ప్రతి రైతు పొలానికి నీరు, ప్రతి యువకుడికి ఉపాధి, ప్రతి కుటుంబానికి భరోసా కల్పించడమే ప్రభుత్వ సంకల్పమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# మొక్కలతో పచ్చని తెలంగాణ నిర్మాణం

మెదటి పేజీ తరువాయి




వరంగల్, ఆగస్టు 25 (మనప్రజాప్రతినిధి): ప్రతి ఒక్కరూ కనీసం ఒక్క మొక్క నాటి పచ్చని తెలంగాణ నిర్మాణానికి తమ వంతు కృషి చేయాలని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ పరిధిలోని రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక వనమహోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించాలంటే విస్తృతంగా మొక్కలు నాటాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి సంరక్షణకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నాటిన ప్రతి మొక్కను పెంచి పెద్ద చెట్టుగా తీర్చిదిద్దినప్పుడే వనమహోత్సవం లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. పచ్చదనం పెరగడం ద్వారా వాతావరణ సమతుల్యత కాపాడటంతో పాటు ప్రజారోగ్యానికి కూడా మేలు జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు, యువత మొక్కల పెంపకంలో చురుకుగా పాల్గొని సమాజానికి ఆదర్శంగా నిలవాలని కోరారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. వనమహోత్సవ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. పచ్చని తెలంగాణ లక్ష్య సాధనకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని మంత్రి కోరారు.

# బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్




హైదరాబాద్, ఆగస్టు 25 (మనప్రజాప్రతినిధి): జనగణనలో భాగంగా బీసీ కులగణనను తప్పనిసరిగా నిర్వహించాలని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. మాజీ పార్లమెంట్ సభ్యుడు, మండల్ కమిషన్ మాజీ అధ్యక్షుడు బీపీ మండల్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని బీపీ మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదన చారి, బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడిన శ్రీనివాస్ గౌడ్, దేశంలో బడుగు బలహీన వర్గాలు విద్య, వైద్యం, రాజకీయ రంగాల్లో ఇంకా వెనుకబడి ఉన్నాయని అన్నారు.బ్రిటిష్ పాలన కాలంలో బీసీ వర్గాలకు సంబంధించిన లెక్కలు సేకరించారని, కానీ ప్రస్తుతం కులగణన అంశాన్ని కేంద్ర ప్రభుత్వం విస్మరిస్తోందని విమర్శించారు. బీసీ వర్గాలకు సంబంధించిన ఖచ్చితమైన గణాంకాలు లేకపోవడం వల్ల రిజర్వేషన్ల అమలులో న్యాయపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. బీసీ కులగణన చేపట్టేందుకు అదనపు వ్యయం అవసరం లేదని, ఎస్సీ, ఎస్టీల కుటుంబాల వివరాలు సేకరించే సమయంలోనే బీసీల కుల వివరాలను కూడా నమోదు చేయవచ్చని అభిప్రాయపడ్డారు. దేశంలోని అన్ని బీసీ కులాల జాబితాను రూపొందించి ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు.బీసీ కులగణన చేస్తామని ప్రకటించి అమలు చేయకపోతే తీవ్ర ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో బీసీలకు సముచిత ప్రాతినిధ్యం లభించాలంటే కులగణన కీలకమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న బీసీ ఎంపీలు, అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు కులగణన అంశంపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు గుజ్జ కృష్ణ, గణేష్ చారి, కుల్కచర్ల శ్రీనివాస్, శ్యామ్ కురుమ తదితరులు పాల్గొన్నారు

# త్వరలో ఇంటింటికి... ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకం ప్రారంభం




హైదరాబాద్, ఆగస్టు 25 (మనప్రజాప్రతినిధి): పేద మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం "ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకం"ను ప్రారంభించింది. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకానికి 18 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన మహిళలు అర్హులు. గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక కుటుంబ ఆదాయం రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 2 లక్షలకు మించకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. దరఖాస్తుదారులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. అర్హులైన మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరచడమే పథకం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. దరఖాస్తులు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో స్వీకరించబడతాయి. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టీజీఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లాల వారీగా దరఖాస్తుల పరిశీలన అనంతరం అర్హుల ఎంపిక చేపట్టనున్నారు. ఈ పథకానికి దరఖాస్తుల స్వీకరణకు 2026 సెప్టెంబర్ 15ను చివరి తేదీగా నిర్ణయించారు. గడువు ముగిసేలోపు అర్హులైన మహిళలు దరఖాస్తులు సమర్పించాలని అధికారులు సూచించారు. పథకానికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం సంబంధిత జిల్లా బీసీ సంక్షేమ అధికారి లేదా బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ కార్యాలయాలను సంప్రదించాలని ప్రభుత్వం వెల్లడించింది. మహిళల ఆర్థిక సాధికారతకు ఈ పథకం దోహదపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# బళ్లారి తెలుగు ప్రజల రుణం తీర్చుకుంటా

- చంద్రబాబు అరెస్టు సమయంలో అండగా నిలిచారని వ్యాఖ్య
- కుడితినిలో లోకేశ్‌కు ఘన స్వాగతం
- తెలుగు ప్రజల పోరాట స్ఫూర్తిని కొనియాడిన మంత్రి
- ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు సహకారం హామీ



బళ్లారి, ఆగస్టు 25 (మనప్రజాప్రతినిధి): చంద్రబాబు నాయుడును అరెస్టు చేసిన సమయంలో బళ్లారి తెలుగు ప్రజలు ప్రదర్శించిన ధైర్యసాహసాలను జీవితాంతం గుర్తుంచుకుంటానని ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ అన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో తమ కుటుంబానికి వెన్నుదన్నుగా నిలిచిన బళ్లారి తెలుగు ప్రజల రుణం తీర్చుకుంటానని పేర్కొన్నారు. కర్ణాటకలోని బళ్లారి జిల్లా కుడితినిలో పర్యటించిన లోకేశ్‌కు స్థానిక తెలుగు ప్రజలు, యువత, తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. భారీ గజమాలలతో సత్కరించిన కార్యకర్తలు బాణసంచా కాలుస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడిన లోకేశ్, 2023 సెప్టెంబర్‌లో చంద్రబాబు అరెస్టు సమయంలో తమ కుటుంబం తీవ్ర ఆవేదనకు గురైందని గుర్తుచేశారు. ఆ సమయంలో బళ్లారి తెలుగు ప్రజలు చేపట్టిన నిరసన కార్యక్రమాలు తమకు అపార ధైర్యాన్ని ఇచ్చాయని అన్నారు.ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారిలో బళ్లారి ప్రజల పోరాటం కొత్త ఉత్సాహాన్ని నింపిందని లోకేశ్ పేర్కొన్నారు. ఆ పోరాట స్ఫూర్తిని ఎప్పటికీ మరువలేనని, భవిష్యత్తులో కూడా బళ్లారి తెలుగు ప్రజలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ స్థాపన వెనుక ఉన్న లక్ష్యాలను కూడా ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజల సంక్షేమం కోసం ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని లోకేశ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు అన్నదమ్ముల్లా కలిసి అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. రెండు రాష్ట్రాల మధ్య సహకారం మరింత పెరగాలని, దక్షిణ భారతదేశ అభివృద్ధికి సంయుక్తంగా కృషి చేయాలని సూచించారు.గతంలో చంద్రబాబు నాయుడు, ఎస్.ఎం. కృష్ణల మధ్య ఉన్న సానుకూల పోటీతత్వం హైదరాబాద్, బెంగళూరు నగరాల అభివృద్ధికి దోహదపడిందని అన్నారు. ఇటీవలి ముఖ్యమంత్రుల సమావేశంలో ఇరు రాష్ట్రాల మధ్య సహకారం, నదుల అనుసంధానం వంటి అంశాలపై చర్చలు జరిగినట్లు తెలిపారు. బళ్లారిలో తెలుగు ప్రజలు స్వచ్ఛందంగా నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్, ఎన్టీఆర్ సర్కిల్ ఏర్పాటు కోసం చేసిన కృషిని లోకేశ్ అభినందించారు. త్వరలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటప్రసాద్, స్థానిక టీడీపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మనస్థాపంతో యువకుడు ఆత్మహత్య



మన ప్రజా ప్రతినిధి కొండపాక/ కుకునూరుపల్లి మండల్: రాయవరం, గ్రామం కు చెందిన కాసార్ల యాదగిరి వా/శీ నర్సయ్య, కుకునూరు పల్లి పోలీస్ స్టేషనలో ఇచ్చిన పిర్యాదు మేరకు ఇంటర్ కంప్లీట్ చేసి కుమారుడు దినేష్ పని చేయకుండా కాలిగా తిరుగు తున్నడు అని తండ్రి అప్పుడప్పుఫు మందలించే వాడు. నిన్న అనగా తేదీ 24:సోమవారం రోజున యాదగిరి రాత్రి 10 గంటలకు ఇంటికి వచ్చిన కొడుకుని ఇంత రాత్రి దాకా పని పాట లేకుండా తిరిగితే మన ఇల్లు ఎలా గడుస్తది బాకీలు ఎలా తీరూతాయాని గట్టిగ మందలించాడు,తర్వాత యాదగిరి, అతని భార్య లక్ష్మి తినేసి పడుకున్నారు. కుమారుడు దినేష్ కూడా తినేసి పక్క రూమ్ లో పడుకున్నాడు.. పొద్దున్న 4 గంటలకు లక్ష్మి లేచి చూసే సరికి పక్క రూమ్ లో పడుకున్న దినేష్ ఉరి వేసుకుని చనిపోయి కనిపించాడు. తండ్రి పని చేయటం. లేదని మందలించడంతో మన స్థాపం చెందిన దినేష్ ఉరి వేసుకుజని చనిపోయాడని పోలీస్ లు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు కుకునూర్ పల్లి ఎస్సై తెలిపారు.

# వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి





మన ప్రజా ప్రతినిధి దినపత్రిక మిర్యాలగూడ ఆగస్టు25:మిర్యాలగూడ డివిజన్ అటవీ శాఖ మిర్యాలగూడ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మిర్యాలగూడ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారుఈ కార్యక్రమంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మున్సిపల్ కమిషనర్ నల్రా శ్రీజా రెడ్డి ఆర్డీ వో రమణా రెడ్డి మున్సిపల్ ఛైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ వైస్ ఛైర్మన్ గుడిపాటి శిరీష నవీన్ పాల్గొని మొక్కలు నాటారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారుపచ్చదనం పెంపొందించడంతో పాటు పట్టణంలో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు మున్సిపాలిటీ అటవీ శాఖలు చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు నాటిన ప్రతి మొక్కను సంరక్షించి వాటి పెరుగుదలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ ఆడోత్ అశోక్ అటవీ శాఖ అధికారులు మున్సిపల్ అధికారులు సిబ్బంది ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు

# జి ఓ నెం 97 ను రద్దు చేసి పాలిటెక్నిక్ విద్యావిధానాన్ని యథావిధిగా కొనసాగించాలి




మన ప్రజా ప్రతినిది దినపత్రిక మిర్యాలగూడ ఆగస్టు 25:అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎఫ్ డిఎస్ అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మిర్యాలగూడ ఆర్డీవో కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా ఏఐడిఎస్ జిల్లా అధ్యక్షులు పోతుగంటి కాశి మాట్లాడుతూతెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జి.ఓ. నెం. 97, శక్తిని తీసుకొని వచ్చి పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయాలనే ఆలోచనను విరమించుకొని జి.ఓ. నెం 97 ను రద్దు చేసి పాలిటెక్నిక్ విద్యావిధానాన్ని యథావిధిగా కొనసాగించాలని అన్నారు పెండింగ్ ఫీజ్ రీయింబర్స్‌మెంట్ స్కాలర్షిప్స్ విడుదల కాక సుమారు 14 లక్షల మంది విద్యార్థులు పై చదువుల కోసం ఉద్యోగాల కోసం సర్టిఫికెట్లు అవసరం ఉన్నందున కాలేజీల యాజమాన్యం సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురి అవుతున్నారు అన్నారు పెండింగ్‌లో ఉన్న ఫీజ్ రీయింబర్స్‌మెంట్ స్కాలర్షిప్స్ విడుదల చేసి విద్యార్థుల సమస్యలనుపరిష్కరించాలన్నారు ఈ కార్యక్రమంలో కిరణ్ పృధ్వి మధు మనోహర్ క్రాంతిశంకర్ తదితరులు పాల్గొన్నారు

# జనగామ పట్టణ కేంద్రంలో ఘనంగా వనమహోత్సవం



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,జనగామ నియోజకవర్గం:జనగామ జిల్లా కేంద్రంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పట్టణంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ మరియు మున్సిపల్ కమిషనర్ పాల్గొని మొక్కలు నాటారు.ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.పచ్చదనం పెంపొందించడంతో పాటు పట్టణంలో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు జనగామ మున్సిపాలిటీ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు.నాటిన ప్రతి మొక్కను సంరక్షించి వాటి పెరుగుదలకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు,సిబ్బంది,ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,స్థానిక ప్రజలు,పాల్గొన్నారు.

## చేర్యాల పట్టణంలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి




మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం.్వహించారు.ఈ కార్యక్రమంలో జనగామ నియోజకవర్గ ఇంచార్జ్,మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి,పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా కొమ్మూరి ప్రతాప్ రెడ్డి,మాట్లాడుతూ,ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా,ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు ద్వారా ప్రభుత్వ అందించే సంక్షేమ ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు నాణ్యమైన బియ్యం, ఇతర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు మరింత సులభంగా అందనున్నాయని తెలిపారు.ప్రజల అవసరాలను గుర్తించి,వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు.చేర్యాల పట్టణ అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ,ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనం అందేలా కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,ప్రజాప్రతినిధులు,లబ్ధిదారులు మరియు స్థానిక ప్రజలు,పాల్గొన్నారు

## ఆకునూరు గ్రామంలో ఘనంగా వనమహోత్సవం



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం. ఆకునూరును ప్రకృతి గ్రామంగా తీర్చిదిద్దాలని,అందుకోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఆకునూరు గ్రామ సర్పంచ్ కొమ్ము రవి అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం ఆకునూరు గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.గ్రామ సర్పంచ్ కొమ్ము రవి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటి నీరు పోశారు.ఇరవై ఐదు మంది విద్యార్థుల రెండు మొక్కల చొప్పున దత్తత తీసుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామస్తులు ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటి పచ్చదనం గ్రామంగా తీర్చిదిద్ది పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు.చెట్ల పెంపకాన్ని బాధ్యతగా తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు శనిగరం వీరస్వామి,గ్రామపంచాయతీ కార్యదర్శి మహమ్మద్ కరీమద్దీన్,ఉపసర్పంచ్ కడారి పల్లవి-భాస్కర్,వార్డు సభ్యురాలు అందె లక్ష్మి,సూర అనిత-సంపత్,తాటికొండ శేఖర్ యాదవ్,జీవ వైవిధ్య యాజమాన్య కమిటీ సభ్యుడు అందె అశోక్,మాజీ కోఆప్షన్ సభ్యురాలు బక్కోని జయలక్ష్మి,ఫీల్డ్ అసిస్టెంట్ మంతపురి లక్ష్మణ్,గ్రామస్తులు షేక్ ఎక్రమద్దీన్,శెట్టె మల్లయ్య,ఉపాధ్యాయులు,విద్యార్థులు, పాల్గొన్నారు.

## కొమురవెల్లి మల్లన్నకు కానుకలు సమర్పించిన భక్తులు



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,కొమురవెల్లి, జనగామ నియోజకవర్గం:జనగామ నియోజకవర్గం. కొమురవెల్లి పట్టణ కేంద్రంలోని శ్రీ మల్లికార్జున స్వామి వారికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు బూర రవి గౌడ్ మరియు శ్రీమతి లక్ష్మీ ప్రసన్న దంపతులు సుమారుగా ఒక కేజీ బరువుగల వెండి పళ్లెం,వెండి శఠ గోపం,వెండి పంచపాళి (నాలుగు పాత్రలు)పూజా సామగ్రిని విరాళంగా సమర్పించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దంపతులను స్వామివారి తీర్థప్రసాదాలతో సత్కరించి అభినందించారు. ఇట్టి కార్యక్రమములో దేవస్థానం సహాయ కార్యనిర్వహణాధికారి.బుద్ధి శ్రీనివాస్,ముఖ్య అర్చక యం మనోహర్ ,సిబ్బంది ఎం. మధుకర్,డి.శంకర్ తదితరులు దంపతులను అభినందించారు

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు చేపట్టిన ఫీజు బకాయి-బీజేపీ లడాయి నిరాహార దీక్షలో పాల్గొన్న బూరుగు సురేష్ గౌడ్



మన ప్రజాప్రతినిధి దినపత్రిక,చేర్యాల,జనగామ నియోజకవర్గం :జనగామ నియోజకవర్గం. బీజేపీ తెలంగాణ అధ్యక్షులు.రామచంద్ర రావు,ఆధ్వర్యంలో, కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఫీజు బకాయి బిజెపి లడాయి ధర్నాలో పాల్గొన్న బూరుగు సురేష్ గౌడ్. ఈ సందర్భంగా బూరుగు సురేష్ గౌడ్ మాట్లాడుతూ వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యపై బీజేపీ తెలంగాణ విద్యార్థుల పక్షాన నిరంతరం పోరాడుతోందని,విద్యార్థులకు న్యాయం జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుందని,కాంగ్రెస్ గవర్నమెంట్ మెడలు వంచి విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని అన్నారు.ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులకు సంబంధించిన ఫీజు బకాయిలను చెల్లించకపోతే విద్యార్థులతో కలసి పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని అన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన పాలిటెక్నిక్ కళాశాల బంద్ విజయవంతం




మన ప్రజా ప్రతినిధి దినపత్రిక,చేర్యాల, జనగామ నియోజకవర్గం :జనగామ నియోజకవర్గం.అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ తలపెట్టిన పాలిటెక్నిక్ కళాశాల రాష్ట్రవ్యాప్త బంద్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రోజున చేర్యాలలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులను బైకాట్ చేసి కళాశాల ముందు జీవో 97 పత్రాలను తగలబెట్టి విజయవంతంగా బంద్ చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ సావుల ఆదిత్య మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్య అనేది పేద,మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వేలాది మంది విద్యార్థులకు సాంకేతిక విద్యతో పాటు ఉద్యోగ,ఉపాధి అవకాశాలకు మార్గం చూపుతున్న కీలకమైన విద్యా వ్యవస్థ.అలాంటి వ్యవస్థకు సంబంధించి విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపే నిర్ణయాలను ప్రభుత్వం పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు.జీవో 97 అమలుతో పాలిటెక్నిక్ విద్యార్థుల విద్యా ప్రమాణాలు,భవిష్యత్ ఉన్నత విద్య,ఉద్యోగ అవకాశాలు మరియు సాంకేతిక విద్యా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు,తల్లిదండ్రులు మరియు విద్యా రంగానికి చెందినవారి అభిప్రాయాలను పూర్తిగా పరిగణనలోకి తీసుకోకుండా ఇలాంటి నిర్ణయాలు అమలు చేయడం సరికాదని వారు పేర్కొన్నారు.ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఇప్పటికే అధ్యాపకుల కొరత, మౌలిక సదుపాయాల సమస్యలు,ప్రయోగశాలలు మరియు ఆధునిక సాంకేతిక పరికరాల కొరత వంటి సమస్యలు ఉన్న నేపథ్యంలో,విద్యార్థులపై అదనపు ప్రభావం చూపే విధానాలను అమలు చేయడం వల్ల వారి భవిష్యత్తు మరింత అనిశ్చితిలో పడే ప్రమాదం ఉందన్నారు,కాబట్టి ప్రభుత్వం జీవో 97ను తక్షణమే రద్దు చేసి, పాలిటెక్నిక్ విద్యను మరింత బలోపేతం చేసే విధంగా సమగ్ర విధానాన్ని రూపొందించాలన్నారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యార్థి సంఘాలు,అధ్యాపకులు,తల్లిదండ్రులు మరియు విద్యావేత్తలతో విస్తృతంగాచర్చించి తదుపరి నిర్ణయాలు తీసుకోవాలన్నారు, జీవో 97ను వెంటనే రద్దు చేయాలి అలాగే పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుకు పూర్తి భరోసా కల్పించాలి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో చేర్యాల ఇన్చార్జ్ సాయి,మేఘన,రమేష్,విద్యార్థులు,పాల్గొన్నారు.

## వెల్దుర్తిలో 18వ మహిళా సమైక్య సర్వసభ్య సమావేశం APM సుభాష్ గౌడ్



మన ప్రజా ప్రతినిధి నర్సాపూర్ 25 : వెల్దుర్తి మండల కేంద్రంలో 18వ వార్షిక మహిళా సమైక్య సర్వసభ్య సమావేశం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నర్సాపూర్ మీూా సునీతా లక్ష్మారెడ్డి గారు హాజరయ్యారు.వెల్దుర్తి మండల మహిళా పరస్పర సహాయ సహకార పరపతి సంఘాల ఫెడరేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం, SERP ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి గారు జ్యోతి ప్రజ్వలన చేసి మహాసభను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మహిళా సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా బలపడుతున్నారని, ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందని అన్నారు. మహిళలు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి దిశగా ఎదగాలని పిలుపునిచ్చారు.శేరిలా గ్రామం లో మహిళ సమైక్య భవనం గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే తక్షణమే స్పందించి తహసిల్దార్ కి సమస్యను పరిష్కరించాలని కోరడం జరిగింది. ఈ సమావేశంలో తహసిల్దార్ విజయలక్ష్మి ఎంపీడీఓ విగ్నేశ్వర్ సర్పంచ్ ఆదర్శ్ ఉప సర్పంచ్ శ్రావణ్-ఆ్యాపీ సుభాష్ గౌడ్ జజ లక్ష్మణ్ వివిధ అధ్యక్షురాలు రూప కార్యదర్శి భాగ్యారాణి కోశాధికారి నర్సమ్మ VOA అశోక్ మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక :మహబూబ్ నగర్ జిల్లా కోయిలకొండ మండలంలో..ప్రతి ఒక్కరూ తన వంతుగా మొక్కలు నాటాలని వాటి సంరక్షణపై అందరి బాధ్యత ఉందని జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివకుమార్ అన్నారు. మంగళవారం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఇంటింటా చెట్టు ప్రగతికి మెట్టు అంటూ నినాదాలు చేస్తూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వివేకానంద చౌరస్తాలో మానవ హారం ఏర్పాటు వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగ్య నాయక్. విజయ భాస్కర్ రెడ్డి. ప్రభాకర్. సుమన్ మహారాజ్. మచందర్. తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మహబూబ్ నగర్ జిల్లా :కోయిలకొండ మండలంలోనీ.. కొత్లాబాద్ గ్రామంలో ప్రతి ఒక్కరూ తన వంతుగా మొక్కలు నాటాలని వాటి సంరక్షణపై అందరి బాధ్యత ఉందని గ్రామ సర్పంచ్ రాజు అన్నారు. మంగళవారం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులచే మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఇంటింటా చెట్టు ప్రగతికి మెట్టు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ క్రాంతి కుమార్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు జగన్నాథ్ మరియు ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## అలయన్స్ క్లబ్ ఆఫ్ ఇల్లంతకుంట ఏ అధ్యక్షురాలు గా అల్లాడి సంగీత



మన ప్రజాప్రతినిధి/ మనకొండూరు తేదీ 25 ఆగస్టు :ఇల్లంతకుంట మండల కేంద్రంలో మంగళవారం రోజున అలయన్స్ క్లబ్ జోన్ చైర్మెన్ అల్లాడి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో అలయన్స్ క్లబ్ ఆఫ్ ఇల్లంతకుంట ఏ సభ్యుల సమావేశం లో సభ్యులందరూ కలిసి అలయన్స్ క్లబ్ ఆఫ్ ఇల్లంతకుంట ఏ అధ్యక్షురాలుగా అల్లాడి సంగీతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఎర్రోజు రవితేజ సెక్రటరీ,అంతటి శ్రీకాంత్ ట్రెజరర్,ఎర్రోజు అభిరామ్ పి ఆర్ ఓ గా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అల్లాడి సంగీత మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడానికి నాకు అవకాశం కల్పించిన జోన్ చైర్మన్ అల్లాడి ఆనంద్ కుమార్ అలయన్స్ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ప్రజా జీవితంలో ప్రజలకు సేవ చేయడమే సంతృప్తిని ఇస్తుందని అన్నారు. అలయన్స్ క్లబ్ ఆఫ్ ఇల్లంతకుంట ఏ ఆధ్వర్యంలో ప్రజల అవసరాలను తీర్చే అనేక సేవా కార్యక్రమాలు చేస్తానని తెలిపారు. సభ్యుల సహకారంతో మునుముందు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎర్రోజు గోపాలచారి, తూముకుంట మోహన్ రెడ్డి,కట్ట ఎల్లారెడ్డి ,ఉప్పల వేణు,ఈదుల రవీందర్ రెడ్డి,నలుమాంచ శ్రీనివాస్ ,మెట్ట రాములు,కొట్టె వెంకటి ,జనకే రవీందర్,చీకటి మల్ల వెంకటేశం, డాక్టర్ వెన్నమనేని జగన్మోహన్, డాక్టర్ అర్కంటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# టి ఈ జె ఏ సి ధర్నాను విజయవంతం చేయండి



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట ఆగస్ట్ 25: తెలంగాణ జె ఏ సి ఆధ్వర్యంలో ఆగస్ట్ 27 న మెదక్ జిల్లా లొ నిర్వహిస్తున్న మహా ధర్నా ను విజయవంతం చేయాలని మండల టిఈజేఏసి నాయకులు పిలుపునిచ్చారు, మండలంలోని, ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాల, నాయకులు ఇట్టి ధర్నా లొ పాల్గొని విజయవంతం చేయాలని మంగళవారం భోజన విరామం సమయంలో మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో ఒక ప్రకటన విడుదల చేశారు, ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ పిఆర్సి ప్రకటించి, వెంటనే అమలు పరచాలని, పెండింగ్ డి ఏ లను విడుదల చేసి, జీవో 317 ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని, సీపీఎస్ రద్దు చేసి, ఓ పి ఎస్ అమలు చేయాలని అన్నారు, ఈ కార్యక్రమంలో టీ జెసి నాయకులు, తాసిల్దార్ బాల లక్ష్మి, ఎంపీడీవో సిబ్బంది విజయ్, టిఆర్టిఎఫ్ అధ్యక్షులు జగన్ లాల్ , యుటిఎఫ్ అధ్యక్షులు బాల పోచయ్య, ఎస్ టి యు అధ్యక్షులు పెంట గౌడ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట జిల్లా పోలీస్ అధ్యక్షుడిగా డాక్టర్ చిందం సుభాష్ ఎన్నిక ఘనంగా సన్మానించిన సూరంపల్లి గ్రామస్తులు



(మన ప్రజా ప్రతినిధి ఆగస్టు 25):సిద్దిపేట జిల్లా: సిద్దిపేట జిల్లా పోలీస్ అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ చిందం సుభాష్‌ను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఆయనకు నూతన బాధ్యతలు దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ఉపసర్పంచ్ తాటి సాయి, గంగాధరి స్వామి, వార్డు నెంబర్ బొల్లం రాజేష్, భూపతి రెడ్డి, రవీందర్, చంటి తదితరులు పాల్గొని డాక్టర్ చిందం సుభాష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా స్థాయిలో ఆయన మరింత సమర్థవంతంగా సేవలందించి ప్రజలకు, పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.డాక్టర్ చిందం సుభాష్ ఎన్నిక కావడం తమ ప్రాంతానికి గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనను అభినందించిన వారందరికీ డాక్టర్ చిందం సుభాష్ కృతజ్ఞతలు తెలిపారు.

# లోవోల్టేజి సమస్య పరిష్కరించండి

మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట ఆగస్ట్ 25,:చేగుంట పట్టణంలోని పలు వార్డు లో లోవోల్టేజి సమస్య తో విలువైన ఎలక్ట్రిక్ వస్తువులతో, పాటు ఇంట్లో ఉన్న బోరు మోటర్లు నడవకపోవ డంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని , దీనితో పాటు కరెంట్ స్తంభాల వైర్లు వేలాడడం ఉండటం,స్థంభానికి స్థంభానికి ఎక్కువ ఉండటం వల్ల వైర్లు ఒకదానికి ఒకటి అల్లుకుంటున్నయి ,మండల విద్యుత్ శాఖ ఎ ఈ కి వినతి పత్రం అందించిన పట్టణ వార్డ్ సభ్యులు. అనంతరం ఏ ఈ స్పందించి త్వరలోనే ఇటి సమస్యను పరిష్కరిస్తానని అన్నారు.



# మొక్కలు నాటడమే కాదు.. వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలి...



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా: తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పర్యావరణ పరిరక్షణతోనే వేగవంతమైన అభివృద్ధి పచ్చదనం పెరిగితే వర్షపాతం, పర్యావరణ సమతుల్యత మెరుగుపడుతుంది స్తంభాద్రి ప్రకృతి వనం (వెలుగుమట్ల అర్బన్ పార్కును) ఆహ్లాదకరమైన రిక్రియేషన్ ప్రదేశంగా అభివృద్ధి చేయాలి స్తంభాద్రి అర్బన్ పార్కులో వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి తుమ్మలమొక్కలు నాటడమే కాకుండా వాటి మనుగడ, సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.స్తంభాద్రి ప్రకృతి వనం (వెలుగుమట్ల) అర్బన్ పార్కులో మంగళవారం నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, పోలీస్ కమీషనర్ సునీల్ దత్‌తో కలిసి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూలి ప్రస్తుతం వన మహోత్సవ కార్యక్రమాల్లో మొక్కలు నాటడంపైనే ఎక్కువగా దృష్టి పెడుతున్నామని, అయితే వాటి మనుగడ, సంరక్షణపై కూడా అంతే శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. మొక్క నాటిన ప్రతి ఒక్కరూ దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు.అడవుల నరికివేత, పచ్చదనం తగ్గిపోవడం వల్ల ప్రపంచ వ్యాప్తంగా వాతావరణంలో తీవ్ర మార్పులు చోటు చేసుకుంటున్నాయని మంత్రి తెలిపారు. పసిఫిక్ మహా సముద్రం ఇంతగా వేడెక్కిన పరిస్థితి గత 150 సంవత్సరాల చరిత్రలో ఎన్నడూ లేదని, రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే ప్రమాదం ఉందని అన్నారు.కృష్ణా, గోదావరి, మున్నేరు నదుల్లో ప్రస్తుతం ఆశించిన స్థాయిలో నీటి ప్రవాహం లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. చరిత్రలో బయ్యారం చెరువు నిండకపోవడం వంటి పరిస్థితి ఎప్పుడూ లేదని, ప్రస్తుతం బయ్యారం చెరువులో కూడా నీరు లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. వచ్చే ఏడాది త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే పర్యావరణ పరిరక్షణపై దృష్టి పెట్టాలని సూచించారు.తాను ప్రజా జీవితంలోకి వచ్చిన ప్రారంభ రోజుల్లో వారానికి ఒకసారి నీటి సరఫరా జరిగేదని, ప్రస్తుతం ప్రతిరోజూ త్రాగునీరు అందించే స్థాయికి పరిస్థితులు మెరుగుపడ్డాయని మంత్రి అన్నారు. ప్రజలకు నీరు, రహదారులు, విద్యుత్, మౌళిక వసతులు కల్పించి అభివృద్ధిని వేగవంతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు పచ్చదనం పెంపు ఎంతో ముఖ్యమని మంత్రి తెలిపారు. పచ్చదనం పెరిగితే వర్షపాతం కూడా మెరుగుపడుతుందని అన్నారు. ఈ ఏడాది అటవీ ప్రాంతాల్లోనే ఎక్కువగా వర్షపాతం నమోదైందని పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల్లో ప్రజలు పచ్చదనం పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఖమ్మం ప్రజలు స్తంభాద్రి స్తంభాద్రి ప్రకృతి వనం (వెలుగుమట్ల) అర్బన్ ఫారెస్ట్ వంటి పచ్చని ప్రాంతాలను కలిగి ఉండటం అదృష్టమని మంత్రి అన్నారు. పిల్లలను ఇలాంటి ప్రాంతాలకు తీసుకువచ్చి వివిధ రకాల చెట్లు, వాటి ఉపయోగాలను పరిచయం చేయాలని సూచించారు.ప్రస్తుత తరంలో అనేక రకాల చెట్లను గుర్తించలేని పరిస్థితి ఏర్పడుతోందని, పిల్లలకు ప్రకృతి, పర్యావరణంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసినప్పుడే అభివృద్ధిలో మంచి మార్పు సాధ్యమవుతుందని మంత్రి అన్నారు. ప్రజల ఆరోగ్యానికి పరిసరాలు పరిశుభ్రంగా, పచ్చగా ఉండటం ఎంతో అవసరమన్నారు. చెట్లు లేకపోతే ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బును ఆసుపత్రుల్లో ఖర్చు చేయాల్సిన పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. ఎన్ని కోట్ల రూపాయల సంపద ఉన్నా పర్యావరణం ఆరోగ్యకరంగా లేకపోతే దాని వల్ల ప్రయోజనం ఉండదని మంత్రి అన్నారు. వన మహోత్సవ కార్యక్రమాల సమయంలో మాత్రమే మొక్కలు నాటకుండా ప్రతి ఒక్కరూ తమ జీవితంలో మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం ఒక అలవాటుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణతోనే వ్యక్తిగతంగా, సమాజంగా అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని మంత్రి కోరారు.ప్రస్తుతం మనం చేస్తున్న పనులు భవిష్యత్ తరాలపై ప్రభావం చూపుతాయని, వారికి మెరుగైన పర్యావరణాన్ని అందించేందుకు మంచి పనులు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వెలుగుమట్ల అర్బన్ పార్కును పిల్లలు, వృద్ధులు, వాకర్లకు అవసరమైన అన్ని సౌకర్యాలతో ఆహ్లాదకరమైన రిక్రియేషన్ ప్రదేశంగా అభివృద్ధి చేయాలని, ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వృక్షప్రసాదాలు మంత్రి పంపిణీ చేశారు.అంతకుముందు మంత్రి వెలుగుమట్ల పార్క్ ను స్తంభాద్రి ప్రకృతి వనం గా నామకరణం, లోగోను ప్రారంభించారు. యూనియన్ బ్యాంక్ అందించిన బ్యాటరీ వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ దుర్గాప్రసాద్, మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, డిఎఫ్ఓ అనూజ్ అగర్వాల్, డిఆర్డీవో శ్రీరామ్, ఆర్డీఓ శ్రీనివాస్, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# నేత్రాలను దానం చేసే వారిని ప్రోత్సయించాలి



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక సూర్యాపేట జిల్లా: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీ నందు 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ నేత్రదాన పక్షోత్సవాల అవగాహన మరియు ప్రచార కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నేత్రదానం ఒక మహత్తరమైన సామాజిక సేవ అని, ఒక వ్యక్తి మరణానంతరం దానం చేసే నేత్రాలు ఇద్దరు అంధులకు వెలుగును ప్రసాదించే అవకాశం ఉందని తెలిపారు. వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది పుట్టిన శిశువు నుండి అన్నీ వయస్సుల వారికి నేత్ర రుగ్మతలను గుర్తించి, తగిన చికిత్స అందించి వారికి మంచి చూపుతో ఆరోగ్య కరమైన జీవితం అందించాలని, ప్రజలు నేత్రదానంపై ఉన్న అపోహలను తొలగించుకొని, తమ కుటుంబ సభ్యులకు నేత్రదానం ప్రాముఖ్యతను తెలియజేయాలని సూచించారు. స్కూల్స్ , కాలేజీ విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించాలని, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కంటి ఆపరేషన్ల నిర్వహణ కొరకు 90 రోజులలో ఆపరేషన్ థియేటర్ అందుబాటులోకి తేవాలని, మెడికల్ కళాశాలలో లైబ్రరీ నిర్వహణకు సంబంధించి 30 లక్షల లోగడ విడుదలైన నిధులను సద్వినియోగం చేసుకుని నైపుణ్యం కలిగిన మంచి వైద్యులుగా పేరు తెచ్చుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భముగా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యక్రమాలను సమర్ధవంతముగా అమలు పరుచుటకు రూ .50,000 మంజూరు చేశారు."మీ కళ్లను మరణానంతరం మట్టిలో కలపకుండా, మరొకరి జీవితంలో వెలుగుగా మార్చండి నేత్రదానం చేయండి" అని ప్రజలకు పిలుపునిచ్చారు. నేత్రదానంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఆగస్టు 25 నుండి సెప్టెంబర్ 8 వరకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు, ఆసుపత్రులు, నర్సింగ్ కళాశాలలు, వైద్య కళాశాలలు మరియు ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు నేత్రదానం ప్రాముఖ్యతను వివరించనున్నట్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా,, పెండెం వెంకట రమణ తెలిపారు. ఈ సందర్భంగా నర్సింగ్ కళాశాల నుండి ప్రభుత్వ వైద్య కళాశాల వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో నర్సింగ్ విద్యార్థులు, వైద్యులు, వైద్య సిబ్బంది, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొని "నేత్రదానం చేయండి మరొకరికి చూపును ప్రసాదించండి" అంటూ ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డా,, శ్రవణ్ కుమార్, కంటి వైదులు డా,, యస్ రమేశ్ కుమార్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె. వెంకట రమణ, ప్రోగ్రాం అధికారి డా,, జి చంద్రశేఖర్, డా,, నాజియా తబస్సుం, డా,, శ్రీశైలం, డా,, వాసవి, వైద్య , ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజకీయ ఖైదీల విడుదలకై ఇందిరాపార్కు వద్ద 29 న ధర్నా

మన ప్రజాప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్:రాజకీయ ఖైదీల విడుదల ఐక్యవేదిక పోస్టర్, కరపత్రాల ఆవిష్కరణ.సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్ షావలి అధ్వర్యంలో జరిగిన కార్యక్రమం. పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలకు చెందిన నేతలు..రాజకీయ ఆదివాసీ, ప్రజాసంఘాల, మేదావులపై పెట్టిన ఉపా కేసులను ఎత్తివేసి, ప్రజలకోసం పోరాడిన రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని, ఉపాచట్టాన్ని, ఎన్ఐఏను రద్దుచేసి, తెలంగాణ ఉద్యమకారులపై, ముస్లిం మైనారిటీలపై నమోదు చేసిన అన్ని రకాల అప్రజాస్వామిక తప్పుడు కేసులను ఎత్తివేసి, అక్రమ అరెస్టులకు గురికాబడి, శిక్ష పడిన మహిళా సంఘాల రాజకీయ ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలకు చెందిన నేతలు డిమాండ్ చేశారు.ఈనెల 29న, హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద జరిగే రాజకీయ ఖైదీల విడుదల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిస్తూ 2026, ఆగష్టు–25, మంగళవారం రోజు, స్థానిక కీసర సర్కిల్, జవహర్ నగర్ జీహెచ్ఎంసీ పరిధిలోగల డాక్టర్ అంబేద్కర్–బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల వద్ద పోస్టర్, కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్ షావలి ఆధ్వర్యంలో నిర్వహించారు. బీఎస్పీ బిర్రు యాకస్వామి, సిపిఐ దర్శనం యాదగిరి, సిపిఎం శివన్నారాయణ, నగేష్, సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ గడ్డం సదానందం, ఐ.ఎఫ్.టి.యు. పి శివబాబు, ఏ.ఐ.ఎఫ్.టి.యు. వై మల్లేష్, బహుజనసత్త బండకింది సింగరయ్య గౌడ్, టియుసిఐ వి.ప్రవీణ్, ఏఐటియుసి అంబాల ఎల్లయ్య, సిఎంఎస్ అల్లూరి సావిత్రి, పిఓడబ్ల్యూ డి.స్వరూప పిడిఎం చంద్రమౌళి, ప్రజానాట్యమండలి వెంకటారి, పిఓడబ్ల్యూ(విముక్తి) గడిపే సునీత, పిఓడబ్ల్యూ అరుణక్క, జయసుధ, బహుజన రక్షణ సమితి మహ్మద్ జావేద్, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ టి.కాలేషా, టివిఐవి మబ్బుబాలు, తెలంగాణ టీచర్స్ మరియు లెక్చరర్స్ ఫెడరేషన్ సురేందర్, రైతు స్వరాజ్య వేదిక నర్సింహ్మా, శ్రావణ్ కుమార్, మాజీ పిడిఎస్యూ దర్గయ, జర్నలిస్ట్ కొన్నెవేణు తదితరులు పై కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రశ్నించే జర్నలిస్టులు, లాయర్లు, డాక్టర్లు, హక్కుల నేతలు, పోరాడే వివిధ ప్రజా సంఘాలు, పార్టీల నాయకులు, కార్యకర్తలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబించిన కక్ష పూరితమైన అణిచివేత కుట్రలో బాగంగా ప్రయోగించిన నిర్భంధ చర్యలన్ని అప్రజాస్వామికం అని ఎండగట్టారు. అర్థిక, రాజకీయ, అసమానతలను పెంచే, ప్రజా వ్యతిరేక విధానాలతో రాజ్యాంగం కల్పించిన ప్రజాసంక్షేమాన్ని, దేశ అభివృద్ధిని విస్మరిస్తున్నారని మండిపడ్డారు. ప్రకృతి–పర్యావరణ విధ్వంసానికి పాల్పడి, సామ్రాజ్యవాద, బడా కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకు అనుకూలమైన విధానాలతో మెజార్టీ పీడిత ప్రజల జీవించే హక్కును, జీవనోపాధిని దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. ప్రజల ప్రాణాలను, వారి ఆరోగ్యాలను హరించివేస్తున్న జవహర్ నగర్ రాంకీ చెత్త డంపింగ్ యార్డును ఎత్తివేయాలని గత 25 సంవత్సరాలుగా పరిసర ప్రాంతాల ప్రజలతో కలిసి, ఉద్యమించిన జవహర్ నగర్ ప్రజా హక్కుల పరిరక్షణ పోరాట కమిటి నేతలపై బనాయించిన తప్పుడు కేసుల వలన నేటికి కోర్టుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నామని గుర్తుచేశారు. ప్రజల మౌళిక అవసరాల కొరకు బలమైన పోరాటాలు చేస్తున్న ప్రజా ఉద్యమకారులపై పాలక ప్రభుత్వాలు చేపట్టే అణిచివేత నిర్భంధ చర్యలు భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు బంగకరమని పేర్కొన్నారు. ఇప్పటికైన పాలకులుతెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలతో పాటు చతిస్గడ్, జార్ఖండ్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, కేరళ, బెంగాల్, మహారాష్ట్ర, ఢిల్లీ తదితర జైలల్లో ఎలాంటి విచారణలు, బెయిల్లు, బందుమిత్రుల పరామర్శాలు లేకుండా సంవత్సరాల తరబడి రాజకీయ ఖైదీలుగా ఉన్న వేలాదిమంది ఆదివాసులను, ఇతర రాజకీయ ఖైదీల విడుదల కొరకు చట్టబద్ధమైన తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో బాగంగా రాష్ట్రంలో అన్యాయంగా, అక్రమంగా నిర్భందించబడ్డ రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వివిధ రాష్ట్రాల జైలల్లో మగ్గిపోతున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన రాజకీయ ఖైదీల విడుదలకు మానవత దృక్పథంతో తగిన చొరవను ప్రదర్శించాలని సూచించారు.



# హత్యకు గురైన దంపతుల కుటుంబానికి ప్రభుత్వ అండ..



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక సూర్యాపేట జిల్లా:బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ.బాధిత కుటుంబానికి అట్రాసిటీ కేసు పరిహారం ఉత్తర్వులు అందజేత.ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠిన శిక్షలు పడేలా చూస్తాం: కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్.డీఎస్పీని దర్యాప్తు అధికారిగా నియమించాశీ, నిపుణులైన అడ్వకేట్ సలహాలు తీసుకుంటున్నాశీ. : ఎస్పీ నరసింహ.మోతే మండలం బిక్యా తండాకు చెందిన భార్య, భర్తలు నాగులు, బుబా ఇటీవల దారుణ హత్యకు గురైన సందర్భంగా దంపతుల కుటుంబ సభ్యులకు జిల్లా యంత్రాంగం పూర్తి అండగా ఉంటుందని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ భరోసా కల్పించారు. మంగళవారం నాడు వారు స్వయంగా బిక్యా తండాలోని బాధిత దంపతుల నివాసానికి వెళ్లి, వారి కుమార్తెలు జ్యోతి, సంధ్య లను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పరంగా అట్రాసిటీ కేసు కింద రావాల్సిన ఆర్థిక సహాయంలో మొదటి విడతగా 50 శాతం 4.2 లక్షలు నగదును బాధితుల ఖాతాలో జమ చేసినట్లు తెలిపి, అందుకు సంబంధించిన ప్రొసీడింగ్స్ ఉత్తర్వులను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ ఇలాంటి ఘోరమైన సంఘటన జరగడం అత్యంత బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పడానికి మరియు జిల్లా యంత్రాంగం వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇవ్వడానికే తాము ఇక్కడికి వచ్చామని పేర్కొన్నారు. ఈ కేసులో పోలీసులు ప్రతి చిన్న ఆధారాన్ని అత్యంత నిశితంగా సేకరిస్తున్నారని, చార్జ్‌షీట్‌ను త్వరగా సిద్ధం చేసి కోర్టుకు పంపుతామని చెప్పారు. నేరస్థులకు వీలైనంత త్వరగా కఠిన శిక్షలు పడేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ.. శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని, ఈ జంట హత్యల కేసులో నిందితులను హత్య జరిగిన 24 గంటలు గడవక ముందే గుర్తించి రిమాండ్‌కు తరలించామని వెల్లడించారు. కేసును అత్యంత పారదర్శకంగా, లోతుగా దర్యాప్తు చేయడానికి విచారణ అధికారిగా డీఎస్పీ నీ అధికారిని నియమించినట్లు తెలిపారు. నిందితులను కోర్టు ద్వారా తిరిగి పోలీస్ కస్టడీలోకి తీసుకుని, అన్ని కోణాల్లో విచారించి పక్కా ఆధారాలను రికార్డు చేస్తామన్నారు. బాధితులకు న్యాయం జరిగేందుకు ఈ కేసులో నిపుణులైన అడ్వకేట్‌ను స్పెషల్ అడ్వకేట్ ) సహాయంగా నియమించామని, కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు పంపించి త్వరగా కేసును పరిష్కరింరించి నిందితులకు తొందరగా పెద్ద శిక్షలు పడేలా కృషి చేస్తున్నామని ఎస్పీ వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు డీఎస్పీలు ప్రసన్న కుమార్, శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ వేణు మాధవ్, స్థానిక తహసీల్దార్ వెంకన్న , సీఐ రామకృష్ణా రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, ఇతర మండల అధికారులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన

## తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ శ్రీ బక్కి వెంకటయ్య మరియు కమిషన్ సభ్యులు



మన ప్రజా ప్రతినిధి అక్బర్ పేట భూంపల్లి మండల్ సిద్దిపేట జిల్లా.న్యూఢిల్లీ, ఆగస్టు 25, 2026:తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ గౌరవ శ్రీ బక్కి వెంకటయ్య , కమిషన్ సభ్యులతో కలిసి ఈరోజు న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి గౌరవ శ్రీ జి. కిషన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని దళిత, గిరిజనుల భూములకు సంబంధించిన పలు సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా దళితులు, గిరిజనులకు సంబంధించిన భూ హక్కులు, భూముల పరిరక్షణ, భూ వివాదాలు, పెండింగ్‌లో ఉన్న సమస్యలు జాతీయ స్థాయిలో పరిష్కారం కావాల్సిన అవసరం ఉందని కమిషన్ చైర్మన్ శ్రీ బక్కి వెంకటయ్య వివరించారు.తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన అనేక మంది ప్రజలు తమ భూముల విషయంలో వివిధ సమస్యలను ఎదుర్కొంటున్నారని, సంబంధిత అంశాలపై రాష్ట్ర స్థాయిలో చర్యలు కొనసాగుతున్నప్పటికీ, కొన్ని సమస్యలకు కేంద్ర స్థాయిలో కూడా పరిష్కారం అవసరమని ఆయన కేంద్ర మంత్రి కి వివరించారు.దళిత, గిరిజన కుటుంబాలకు భూమి కేవలం ఆస్తి మాత్రమే కాకుండా వారి జీవనోపాధికి, ఆర్థిక భద్రతకు మరియు భవిష్యత్ తరాల అభివృద్ధికి కీలక ఆధారమని పేర్కొంటూ, పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను సంబంధిత కేంద్ర శాఖలతో సమన్వయం చేసుకుని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని కేంద్ర మంత్రి శ్రీ కిషన్ రెడ్డి ని కమిషన్ చైర్మన్ మరియు సభ్యులు కోరారు.అదేవిధంగా, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, భూ రక్షణకు సంబంధించిన చట్టాలు సమర్థవంతంగా అమలయ్యేలా అవసరమైన సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.కేంద్ర మంత్రి శ్రీ కిషన్ రెడ్డి కమిషన్ చైర్మన్ మరియు సభ్యులు ప్రస్తావించిన అంశాలను సానుకూలంగా విని, దళిత, గిరిజనుల సంక్షేమానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చినట్లు కమిషన్ వర్గాలు తెలిపాయి.ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు కుస్త్రం నీలాదేవి,సభ్యులు రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ,చైర్మన్ ్రా భారత్,ఎస్సీ ఎస్టీ పి ఓ యాక్ట్ మెంబర్ బిట్ల వెంకటేశ్వర్లు,దుబ్బాక నవీన్,చేతన్,పాల్గొని రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ ప్రజల భూ సమస్యలు మరియు వారి హక్కుల పరిరక్షణకు సంబంధించిన పలు అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

# అసమాన త్యాగాలకు నిలువెత్తు రూపం బిందేశ్వరి ప్రసాద్ మండల్




హుజూర్నగర్ (మన ప్రజా ప్రతినిధి దినపత్రిక)బీసీ రిజర్వేషన్ల కోసం ఈ దేశ బీసీ పౌరుల భవిష్యత్తు కోసం ముఖ్య మంత్రి పదవిని త్యాగం చేసిన అసమాన సాహసి బిందెశ్వరి ప్రసాద్ మండల్ అని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు మంగళవారం సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ లో బిందెశ్వరి ప్రసాద్ నూట ఏడవ జయంతి కార్యక్రమాన్ని బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో స్థానిక శాంతి స్థూపం వద్ద నిర్వహించిన సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ధనుంజయ నాయుడు మాట్లాడుతూ..... గత ఎనిమిది దశాబ్దాలుగా బీసీల హక్కుల కోసం వారి అభ్యున్నతి కోసం అనేక ఉద్యమాలు జరుగుతూనే ఉన్నాయని ముఖ్యంగా బిందేశ్వరి ప్రసాద్ బీసీ రిజర్వేషన్ ఉద్యమ పితామహుడు అని ఆయన బాటలోనే నేడు అనేక బీసీ ఉద్యమాలు కొనసాగుతున్నాయని ముఖ్యంగా చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్లు విద్యా ఉద్యోగ ఉపాధి రంగాల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కొరకు అనేక బీసీ ఉద్యమాలు దేశవ్యాప్తంగా జరుగుతున్నాయని అయినప్పటికీ పాలకుల్లో చిత్తశుద్ధి లోపించటం వల్ల బీసీలను ఓట్లు వేసే యంత్రాలుగానే పరిగణిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు బీసీ ఉద్యమ శకం నడుస్తున్నదని ఇప్పుడు జరుగుతున్న జన గణనలో కుల గణన చేపట్టి దేశంలో ఏ కుల జనాభా ఎంత ఉందో వెలికి తీసి అంతే దామాషా పద్ధతిలో విద్యా ఉద్యోగ ఉపాధి మరియు రాజకీయ రంగాల్లో రిజర్వేషన్ కల్పించి స్వాతంత్ర ఫలాలను అందరికీ అందించేందుకు కృషి చేయాలని కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయడమే కాకుండా రెండు లక్షల కోట్ల నిధులు కేటాయించి జాతీయస్థాయిలో బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ రైతు సంఘం జిల్లా నాయకులు చెక్కుల రమేష్ , బీసీ హక్కుల సాధన సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు చిలక రాజు శీను సహాయ కార్యదర్శి కుమార్ రాజు వెంకట్ నూతన గంటి నరసమ్మ ఎల్లయ్య చక్రాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక సూర్యాపేట జిల్లా:మానవ జీవన విధానానికి మొక్కలే కీలకం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్జిల్లా ఎస్పీ కె. నరసింహపర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం మోతే మండలం లోని రాంపురం తండాలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవంలో కలెక్టర్, ఎస్పీ పాల్గొని మొక్కలు నాటారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. పచ్చదనం పెంపొందించేందుకు ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మొక్కలను పెంచడం వలన అవి మన భావితరాలకు కావలసిన ఫలాలను అందిస్తాయని అన్నారు అనంతరంమామిళ్లగూడెం హైస్కూల్‌ను సందర్శించిన కలెక్టర్, ఎస్పీ విద్యార్థులతో ముచ్చటించారు. విద్యాప్రగతి, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలో మౌలిక వసతుల గురించి, పిల్లల భోజనం, పిల్లలు హాజరు శాతం గురించి కలెక్టర్ హెడ్మాస్టర్ ని అడిగితెలుసుకున్నారు.ఈ కార్యక్రమాల్లోరాంపురం సర్పంచ్ బానోతు సత్తెమ్మ,మండల స్పెషల్ ఆఫీసర్ శ్యాంసుందర్ రెడ్డి, తాసిల్దార్ వెంకన్న, ఎంపీడీవో సందీప్ కుమార్, హెడ్మాస్టర్ నళిని, ఎంపీఓ వంశీకృష్ణ, జర్నలిస్టులు, గ్రామ ప్రజలు

# హాస్టల్ భవనం పైనుంచి దూకిన విద్యార్థి



మన ప్రజా ప్రతినిధి మిడిదొడ్డి మండల్. దుబ్బాక నియోజకవర్గం. సిద్దిపేట జిల్లా:మూడు అంతస్థుల భవనం పై నుంచి విద్యార్థిని దూకిన సంఘటన సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల హాస్టల్లో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది.మూడు అంతస్థుల భవనం పై నుంచి విద్యార్థిని దూకిన సంఘటన సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల హాస్టల్లో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. గమనించిన సిబ్బంది అప్రమత్తమై 108 వాహనంలో సిద్దిపేట ఆసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించినట్లు హాస్టల్ సిబ్బంది తెలిపారు. విద్యార్థిని భూంపల్లి గ్రామానికి చెందిన వర్గీని 7వ తరగతి చదువుతుంది. విషయం తెలుసుకున్న ఇతర విద్యార్థినుల తల్లిదండ్రులు హాస్టల్ కు చేరుకున్నారు. దీంతో హాస్టల్ ఆవరణలో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది.. అయితే విద్యార్థిని భవనం పై నుంచి ఎందుకు దూకింది అనే వివరాలు తెలియాల్సి ఉంది.

# బిందెశ్వరి ప్రసాద్ మండల్ త్యాగం నిరుపమానం




నేరేడుచర్ల (మన ప్రజా ప్రతినిధి దినపత్రిక )బీసీలకు 27% రిజర్వేషన్ కావాలని మండల సిఫా కమిషన్ సిఫార్సులను తయారు చేసి ఆ పోరాటంలో తన ముఖ్యమంత్రి పదవిని సైతం త్యాగం చేసిన బింగేశ్వరీ ప్రసాద్ మండల్ చేసిన త్యాగం నిరుపమానమైనదని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల ప్రధాన కూడలిలో బీపీ మండల్ 107వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ.... బీసీ రిజర్వేషన్ పితామహుడిగా, బీసీ ఉద్యమాలకు ఆధ్యుడిగా భారత మాజీ ప్రధాని విశ్వనాథ ప్రతాప సింగ్ కు అత్యంత గౌరవనీయుడుగా చరిత్రలో నిలిచిపోయిన మహనీయుడని ఆయన చూపిన బాటలోనే నేడు మనందరం ముందుకు సాగాల్సిన అవసరం ఉన్నదని నేడు కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం బీసీలకు తీరని ద్రోహం చేస్తున్నదని గత 12 సంవత్సరాలుగా జనగణనలో కుల గణన చేపట్టకుండా ఏకాభిప్రాయ సాధన పేరుతో వాయిదాలు వేస్తూ వస్తున్నదని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని రెండు లక్షల కోట్ల నిధుల తో కేంద్రంలో బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటుచేసి బీసీ అభ్యున్నతికి పాటు పడాలని ఉద్యోగస్తులకు ప్రభువు విషయాల్లో రిజర్వేషన్ పాటించాలని బీసీల పాలిట్ల శాపంగా ఉన్న క్రిమిలేయర్ ఎక్కి వేయాలది బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు నిర్వహించవలె 5 కేంద్రంలో ఉన్న ప్రభుత్వానికి చీమకుట్టినట్టైనా లేదని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీసీలంతా ఏకమై బిజెపికి దాని మిత్రపక్షాలకి తగు గుణపాఠం నేర్పి గద్దె దించాలి ఆయన విజ్ఞప్తి చేశారు కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి సుందరయ్య బి.ఆర్.ఎస్ నియోజకవర్గ నాయకులు రాపోలు నవీన్ బీసీ హక్కుల సాధన సమితి జిల్లా గౌరవాధ్యక్షులు చిలక రాజు శ్రీను జిల్లా సహాయ కార్యదర్శి కొమ్రరాజు వెంకట్ , బీసీ హక్కుల సాధన సమితి నాయకులు వాడాల భాస్కర్ బండి శ్రీనివాస్ కాసాని నాగరాజు ఎస్కే పాషా నూతన గంటి నరసమ్మ ఎల్లయ్య ధూళిపాళ నిఖిల్ చక్రవర్తి యరమాద శేఖర్ పాల్గొన్నారు

## తెలంగాణ వార్డ్ మెంబర్స్ ఫోరం కొండపాక మండల కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



మన ప్రజా ప్రతినిధికొండపాక :మండల కేంద్రంలో మంగళవారం రోజు తెలంగాణ వార్డ్ మెంబర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు నాగబెల్లి జ్యోతి ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు ముక్క అనిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి గద్దె రాజు సమక్షంలో కొండపాక మండల కమిటీ ఏర్పాటు చేశారు. కొండపాక మండల అధ్యక్షులుగా అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రాసుల రేఖా నరేందర్, గౌరవ అధ్యక్షులుగా నాయిని రాములు, మూడోజు సిద్దులు, ఉపాధ్యక్షులుగా లగిశెట్టి రాజేశం రొడ్డ ప్రవీణ్, నలి కట్టే స్వప్న చంద్రశేఖర్, తోకల సంపత్, దొమ్మాట కావ్య రవి, ప్రధాన కార్యదర్శులుగా వేముల బాబు, జంజీరపు పూజా నర్సింలు, కొంచెం రవి, తోకల భాగ్య శ్రీనివాస్, కార్యదర్శులుగా గజ్జె రమేష్, దున్న పూర్ణచందర్, మల్లమారి జ్యోతి సంజీవ్, సనువాల రవి వీరందరూ ఏకగ్రీవంగా ఎన్నుకోబడినారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రేఖ నరేందర్ మాట్లాడుతూ... వార్డు మెంబర్స్ హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన వార్డ్ మెంబర్ లు పాల్గొన్నారు

# 22A నిషేధిత భూముల బాధిత కుటుంబాలతో సమావేశంలో పాల్గొన్న మాజీమంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్:మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్ నగర్ ఎం.జే. గార్డెన్స్‌లో ఎమ్మెల్యే కేపీ వివేకానంద గారి ఆధ్వర్యంలో 22ఏ నిషేధిత భూముల బాధిత కుటుంబాలతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాజీ మంత్రి హరీష్ రావు గారితో కలిసి పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి.ఈ సందర్భంగా బాధితుల ఆవేదనను స్వయంగా అడిగి తెలుసుకొని బీఆర్ఎస్ పార్టీ పక్షాన వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చాను.98 శాతం భూములను 22ఏ జాబితా నుంచి తొలగించామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పచ్చి అబద్ధాలు ఆడుతున్నారు.అదే నిజమైతే వందలాది మంది బాధితులు తమ గోడు వెళ్లబోసుకోవడానికి ఇక్కడికి ఎందుకు వస్తారు?22ఏ జాబితాలో పెట్టడం ప్రభుత్వం చేసిన తప్పు. ఆ తప్పును సరిదిద్దుకోవడానికి దరఖాస్తుల పేరుతో కార్యాలయాల చుట్టూ సామాన్య ప్రజలు ఎందుకు తిరగాలి? లక్షలాది ప్రజల ఆస్తులను రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలో పెట్టి వాళ్లకు కంటి మీద కునుకు లేకుండా చేసి ప్రజలను శిక్షిస్తారా?58 ఏళ్ల క్రితం ఏర్పడిన పద్మారావు నగర్ ఫేజ్-1, 1950ల నాటి స్ప్రింగ్ ఫీల్డ్, నిజాంపేట్ లాంటి కాలనీల్లోని దశాబ్దాల క్రితం నాటి పట్టా భూములను కూడా 22ఏలో చేర్చడం తుగ్లక్ చర్య కాక మరేమిటి..ప్రభుత్వంలో పని కావాలంటే లంచాలు చెల్లించాల్సిందే అన్నట్లుగా ముఖ్యమంత్రి, పొంగులేటి ఏజెంట్లు వసూళ్లకు దిగారు.మహబూబ్ నగర్‌కు చెందిన ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీలో విల్లాకు, ఫ్లాట్‌కు 30 వేల రూపాయలు వసూలు చేస్తున్నారు. డబ్బులు ఇస్తేనే పని అవుతుందని బాధితులు బహిరంగంగానే వాపోతున్నారు.అమీన్‌పూర్ నుంచి వచ్చిన ఒక బాధితుడిని ఎంఆర్వో, ఆర్డీవో, కలెక్టర్ అంటూ చుట్టూ తిప్పించుకుని.. చివరకు బయట బ్రోకర్లను కలిస్తేనే పని అవుతుందని పరోక్షంగా బెదిరిస్తున్నారు.ఈ 22ఏ కుట్ర వెనుక భారీ కమీషన్ల బాగోతం దాగి ఉంది. దీనికి ఏ-1 రేవంత్ రెడ్డి, ఏ-2 పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. 50-50 కమీషన్ల కోసమే ఈ దోపిడీ అంతా జరుగుతోంది.తనకు రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగా తెలుసు అని రేవంత్ రెడ్డి గొప్పలు చెప్పుకుంటారు.ఆ వ్యాపారం తెలిస్తే ప్రజల కష్టాలు తీర్చాలి కానీ, వాళ్ల రక్తం పీల్చి పిప్పి చేస్తారా? రాష్ట్రంలో ఎక్కడ ప్రభుత్వ భూములున్నా హెచ్ఎండీఏ, టీజీఐఐసీ, హౌసింగ్ బోర్డు భూములతో పాటు చివరికి పిల్లలు ఆడుకునే వెయ్యి గజాల పార్కును కూడా రేవంత్ రెడ్డి అమ్మకానికి పెట్టారు.ఇలా అమ్ముకుంటూ పోతే రేపు గుడికో, బడికో.. చివరకు స్మశాన వాటికకు కూడా భూమి మిగలదు.ప్రజల ఆస్తులను కాపాడాల్సిన ప్రభుత్వమే కంచే చేను మేసినట్లుగా తయారై ఆస్తులను లాక్కుని ఆగం చేస్తోంది. ఈ కాంగ్రెస్ పాలనలో లా అండ్ ఆర్డర్ లేకుండా పోయింది. ఆడపిల్లల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కరువైంది.ఈ సమస్య కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాలేదు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు కోటి ఎకరాల వ్యవసాయ భూములను కూడా 22ఏలో పెట్టారు.మల్కాజిగిరిలో 22ఏ భూములపై నేను మాట్లాడినప్పుడు, అక్కడికొచ్చిన వారి పేర్లు రాసుకుని వారి భూములను జాబితా నుంచి తొలగించారు.అలాగే తెలంగాణ భవన్‌కు వచ్చిన బాధితుల వివరాలు తీసుకుని జాబితా నుంచి తీసేశారు. అంటే బీఆర్ఎస్ పోరాటం వల్లే ప్రభుత్వంలో ఈ మాత్రం కదలిక వస్తోంది.ప్రజల గొంతుకగా బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుంది. ప్రజల కష్టాలు ఎక్కడుంటే అక్కడ పార్టీ అండగా నిలబడుతుంది.సెప్టెంబర్ 7న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగానే.. దద్దరిల్లేలా సభను స్తంభింపజేసి అయినా బాధితుల సమస్యలు పరిష్కారం అయ్యేలా కొట్లాడుతాం.భూములను ఎవరు నిషేధిత జాబితాలో పెట్టమన్నారో విచారణ జరగాలి. తక్షణమే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నాం.నిషేధిత జాబితాను సీక్రెట్‌గా ఎందుకు ఉంచుతున్నారు.. వెబ్‌సైట్‌లో జాబితాను ఎందుకు బ్లాక్ చేశారు? ప్రభుత్వం వెంటనే ఈ వ్యవహారంపై శ్వేతపత్రం విడుదల చేయాలి.ప్రజల భూములతో చెలగాటమాడుతూ వారిని నిద్ర లేకుండా చేసిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ముఖ్యమంత్రి తక్షణమే బర్తరఫ్ చేయాలి.

# సూరంపల్లి గ్రామంలో మెగా ప్లాంటేషన్ కార్యక్రమం





(మన ప్రజాపతి ఆగస్టు 25):సూరంపల్లి గ్రామంలో పచ్చదనం పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించడం లక్ష్యంగా మెగా ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటారు. మొక్కలను నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవాలని, ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకంలో భాగస్వాములు కావాలని నాయకులు సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగాధర స్వప్న స్వామి, ఉప సర్పంచ్ తాటి సాయి, వార్డు మెంబర్ బొల్లం రాజేష్, కేంబసరి మల్లేష్, పంచాయతీ కార్యదర్శి విద్యాసాగర్, ాచీవీ పుష్పలత, ఆశా వర్కర్లు బొల్లం రేణుక, కనక లక్ష్మి తదితరులు పాల్గొని మొక్కలు నాటారు."మొక్కలు నాటుదాం పచ్చని భవిష్యత్తును నిర్మిద్దాం" అనే సందేశంతో మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# ఆక్సీజన్ పార్క్ లో ఘనంగా వన మహోత్సవ కార్యక్రమం



మన ప్రజా ప్రతినిధి కొండపాక మండల్:రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన"వన మహోత్సవం"కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా కొండపాక మండల కేంద్రం లోని రాంపల్లి గ్రామ శివారులోని తెజోవనం ఆక్సీజన్ పార్క్ లోని పరిసర ప్రాంతంలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమానికి బిఎఫ్ఓ పద్మజరాణి, ఎఫ్ఆర్ఓ సుజాత, డివైఆర్ఓ పద్మ, యఫ్బిఓ రవికిరణ్,ఫారస్ట్ ఆఫీస్ స్టాఫ్ సభ్యులు,రాంపల్లి గ్రామ సర్పంచ్ బొమ్మ మల్లయ్య,గ్రామ పాలకవర్గం సభ్యులు, మార్పడగ సర్పంచ్ ఆకారం బాలరాజ్ పాల్గొని మొక్కలు నాటారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గ్రామంలో ప్రతీ ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. చెట్లు పెరిగే కొద్దీ వాతావరణంలో మార్పులను కొంతవరకు నియత్రించడంతోపాటు వర్షాలు సమృద్ధిగా కురిసే అవకాశం ఏర్పడుతుందన్నారు.

# సదాశివపేటలో భారీ ఎత్తున నిర్వహించిన మాస్ ప్లాంటేషన్ వనమహోత్సవం చెట్లు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుదాం



సదాశివపేట మండల రిపోర్టర్ ఆగష్టు 25 //(మన ప్రజాప్రతినిధి): సదాశివపేట పట్టణంలో లక్ష చెట్లను నాటడమే ప్రధాన లక్ష్యమన్న మున్సిపల్ కమీషనర్ తౌటం శివాజి, చైర్మన్ అంజమ్మ.వైస్ చైర్‌పర్సన్ రేణుక సదాశివపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని డబుల్ బెడ్రూమ్ సమీపంలో మాస్ ప్లాంటేషన్ వనమహోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం నాడు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ మునిపల్లి అంజమ్మ , వైస్ చైర్‌పర్సన్ రేణుక , 12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత, కౌన్సిలర్ ఎరుకల నర్సింలు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు గారెల తుల్జారాం హాజరై మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇట్టి కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ తౌటమ్ శివాజి, మున్సిపల్ ఇంజనీర్ రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. టిఎంసి మెప్మా డైరెక్టర్ సువర్ణ నేతృత్వంలో ఆర్పి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ రకాల మొక్కలను నాటారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శివాజి మాట్లాడుతూ సదాశివపేట పట్టణాన్ని పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మాస్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. పట్టణమంతా పచ్చదనంతో నిండి కాలుష్యరహిత ప్రాంతంగా మార్చడమే లక్ష్యమన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్ల ముందు, ఖాళీ ప్రదేశాల్లో, రోడ్ల వెంట మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు.చెట్లు ఉంటేనే పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని, ప్రజలకు స్వచ్ఛమైన గాలి అందడంతో పాటు వర్షపాతం పెరగడానికి చెట్లు దోహదపడతాయని పేర్కొన్నారు. సదాశివపేట పట్టణంలో లక్ష మొక్కలు నాటడమే పురపాలక సంఘం లక్ష్యమని కమిషనర్ శివాజి వెల్లడించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మునిపల్లి అంజమ్మ మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద మూడు నుంచి నాలుగు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఇంటి నిర్మాణ అనుమతులు పొందాలంటే ఇంటి యజమానులు మొక్కలు నాటి సంరక్షించేలా నిబంధనలు అమలు చేయాలని కమిషనర్‌కు సూచించారు. వైస్ చైర్‌పర్సన్ రేణుక మాట్లాడుతూ పర్యావరణం బాగుంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. చెట్ల ద్వారా స్వచ్ఛమైన గాలి అందుతుందని, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. 12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత మాట్లాడుతూ చెట్లు పెంచడం వలన మన ఆరోగ్యాలు మనమే కాపాడుకున్న వారమవుతామని, మనము వదిలే చెడుగాలిని చెట్లు పీల్చుకుని మనకు కావాల్సిన ఆక్సిజన్ చెట్లు వదలడం వలన ఆరోగ్యంగా ఉండగలుగుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు పులిమామిడి మమత, అనిత, నిఖిత, రోజా, లక్ష్మి ప్రియ, గోపి ప్రియాంక, శంకర్ గౌడ్, ఎరుకల నర్సింలు, శజ్జి భాయ్, గారెల తుల్జారాం, కోఆప్షన్ సభ్యులు మునిపల్లి సత్యనారాయణ, రహమత్, అనంతమ్మ, మెప్మా సిబ్బంది జాని, శారద, విజయలక్ష్మి, అన్నపూర్ణ, మాధవి, రమ, కిరణ్మయి, నిర్మల, స్వాతి, సునిత, వీరమణి, అరుణ, మున్సిపల్ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# రైతు నేస్తం ప్రత్యక్ష ప్రసారం,వన మహోత్సవం కార్యక్రమం



మన ప్రజా ప్రతినిధి కొండపాక/కుకునూరుపలి:మండల కేంద్రం లోని మేదినీపుర్ రైతు వేదికలో మంగళ వారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమం ఎపిసోడ్104 ప్రత్యక్ష ప్రసారాన్ని జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి , కొండపాక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వీరుపాక శ్రీనివాసరెడ్డి,మండల పరిషత్ అభివృద్ధి అధికారి మహబూబ్ అలీ , మండల వ్యవసాయ అధికారి గోవింద రాజు, వ్యవసాయ విస్తరణ అధికారి రమ్య శ్రీ , మేదినీపుర్ సర్పంచ్ బూరుగు మధు మోహన్ రైతులు పాల్గొని వీక్షించారు.ఈ కార్యక్రమంలో రైతులకు ఉపయోగపడే పలు అంశాలపై నిపుణుల సూచనలు, సలహాలను ప్రత్యక్ష ప్రసారం ద్వారా అందించారు. వరికి ప్రత్యామ్నాయంగా పెసర సాగు చేపట్టి విజయవంతమైన రైతుల అనుభవాలను కూడా ప్రసారం చేసి అభిప్రాయ స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. రైతు నేస్తం కార్యక్రమం అనంతరం వన మహోత్సవంలో భాగంగా మేదినీపూర్ రైతు వేదిక ప్రాంగణం లో మొక్కలు నాటడం జరిగింది. మరియు వన మహోత్సవం కార్యక్రమం లో భాగంగా కుకునూరుపల్లి రైతు వేదిక వద్ద నిర్వహించిన మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించాలని, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, ఏఈఓ లు, రైతులు మరియు ఇతర సిబ్బంది పాల్గొని మొక్కలు నాటారు.వన మహోత్సవంలో భాగంగా మెగా ,అనంతరం కుకునూర్పల్లి గ్రామం నుండి తిప్పారం మార్గంలో మెగా ప్లాంటేషన్ లో భాగంగా మొక్కలు నాటడం జరిగింది.

# మండల్ బిందేశ్వరి ప్రసాద్ మండల్ 109.వ జయంతిని బీసీ జేఏసీ ఆధ్వర్యంలో మండల్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులు

మన ప్రజా ప్రతినిధి దినపత్రిక మిర్యాలగూడ ఆగస్టు25:బీసీ జేఏసీ మిర్యాలగూడ పట్టణ కన్వీనర్ బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణనకు సంబందించి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసి నటువంటి గెజిట్ లో ఓబీసీల కు సంబంధించిన కాలం లేకపోవడం చాలా అన్యాయం సిగ్గుచేటు దుర్మార్గం బీసీ రిజర్వేషన్ ల సాధన కోసం బీపీ మండల్ చేసిన కృషి అనిర్వచనియమైనది మండల్ కమిషన్ సిపారసులన్నింటిని వెంటనే అమలు చేయాలి బీపీ మండల్ జయంతి సందర్భంగా ఆయన ఆశయ సాధన కొరకు ముఖ్యంగా యువకులు ప్రతి ఒక్కరునడుం బిగించి పాటు పడాలన్నారు బీసీలను పట్టి పీడిస్తున్న పేదరికం వెనుకబాటు తనం నుంచి వారిని బయటపడేసే ప్రయత్నంలో బీహార్ మాజీ ముఖ్యమంత్రి బీపీ మండల్ చేసిన కృషి మరువలేనిదని దేశంలో 60 శాతం పైగా జనాభా కలిగిన ఓబీసీలకు విద్య ఉద్యోగ తదితర రంగాల్లో రిజర్వేషన్ల కోసం బీపీ మండల్ చేసిన కృషి ఆనిర్వచనం మైనదని బీసీల ఆరాధ్యులు బీసీ రిజర్వేషన్ల పితామహుడు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బీపీ మండల్ బందేశ్వరి ప్రసాద్ మండల్ 109 వ జయంతిని స్థానిక మిర్యాలగూడ పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో బీసీ జేఏసీ మిర్యాలగూడ పట్టణ కన్వీనర్ బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా మండల్ చిత్రపటానికి పూలమాలలతోనివాళులర్పించడం

# పర్యావరణ సంరక్షణలో ప్రజలు భాగస్వామ్యం కావాలి ఇల్లంతకుంట గ్రామ సర్పంచ్ మామిడి రాజు




మన ప్రజాప్రతినిధి/ మనకొండూరు తేదీ 25 ఆగస్టు:ఇల్లంతకుంట గ్రామంలో గ్రామ సర్పంచ్ మామిడి రాజు ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమంలో ఇల్లంతకుంట మండల అధికారులు, ప్రజా ప్రతినిధుల పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మామిడి రాజు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం ఎంతో ముఖ్యమని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని అన్నారు.ప్రతి కుటుంబం మొక్కలు నాటి నాటిన ప్రతి మొక్కను సంరక్షించి పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇల్లంతకుంట గ్రామాన్ని పచ్చదనంతో నింపే లక్ష్యంతో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి (డి సి ఓ) రామకృష్ణ,ఎంపీడీవో శశికళ, అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ (ఏ పీ ఓ) చంద్రయ్య, గ్రామ ఉప సర్పంచ్ మూగు నాగరాజు శర్మ, వార్డు సభ్యులు దయ్యాల శ్రీలతమహేష్,ఎర్రోజు దీపికరవితేజ,మామిడి సుశీల, మామిడి శ్రీనివాస్,చేరాల వంశీకృష్ణ, రాకం సుమన్,కొట్టే ప్రమీలవెంకన్న,అంతటి శ్రీకాంత్,కూనబోయిన ఎల్లవ్వదేవయ్య,కూనబోయిన రఘు, పిఎసిఎస్ డైరెక్టర్ ఒగ్గు రమేష్,పంచాయతీ సెక్రటరీ చంద్రశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ వేణు,మామిడి రాజు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.